ఆఫీసు నుంచి బాగా అలిసిపోయి ఇంటికి వచ్చాడు చలమయ్య. రాగానే గంగాభవాని మర్యాదగా భర్తని, 'ఏమండీ! ప్రొద్దుట నేను చెప్పిన ప్రకారం సరుకులు అన్నీ జాగ్రత్తగా తెచ్చారా ?' అని అడిగింది. చలమయ్య తెల్లమొహం వేసాడు. మర్నాడు పండుగ – అందుకని కావల్సిన వస్తువులన్నీ జాబితావేసి ఇచ్చింది, ఆమె. డబ్బులుకూడ ఇచ్చింది. చలమయ్య ఆ సంగతే మరిచిపోయాడు. ఆఫీసులో మిత్రుడు ముకుందయ్య 'ప్రాణంమీదికి వచ్చింది. తప్పదురా బాబూ' అని జేబులో చెయ్యేసి ఆ డబ్బులు కాస్తా అప్పుగా అని లాగేసుకున్నాడు. అసలు సంగతి మర్చిపోయిన చలమయ్య గంగిగోవులా తల వూపాడప్పుడు.

# చెంబు



పాలడుగు వెంకటేశ్వరరావు

గంగాభవానిది పెద్ద నోరు. దానికి తిరుగు లేదు. అసలే పండగపనుల వలన ఆమె అలసటగా, చిరాకుగా వుంది. అందుకే ఆమె విరుచుకుని చలమయ్య మీద పడింది.

'మీరు మనుషులేనా ? అది అసలు బుర్రేనా ?' అంది.

'కాదు చెంబు' అన్నాడు బావమరిది పుల్లయ్య. చలమయ్యకే వినపడేటట్టు.

పుల్లయ్యకి, చలమయ్యకి క్షణం పడదు. ఇద్దరూ ఎప్పుడూ చిటపట మంటూ వుంటారు. పుల్లయ్యకి అక్క దగ్గర గారాబం. అందుకె చలమయ్యకి మంట, పుల్లయ్యంటె. పైగా తన బామ్మరిదే తనని చెంబు అని పిలవటం అతనికి సహించరానిదయింది. అందుకు మరొక ప్రబలమయిన కారణమూ వుంది. అందులో మిళితమైన బాధయొక్క గాథా వుంది.

ఎలిమెంటరీస్కూల్లో, హైస్కూల్లో కాలేజీలో కూడ చలమయ్యకి చెంబు అన్న పొర్థకనామం చలామణి అయింది. చిన్నప్పుడు– ఎలిమెంటరీస్కూల్లో టీచరు బెంచీ ఎక్కించీ తిరిగ్గా తొడపాశం పెట్టటం మొదలుపెట్టగానే అది భరించలేక చలమయ్య ఆయన చేతిని కొరికేడు. ఆ కసి కొద్దీ ఆయన చలమయ్యని వంగదీసి గుద్ది గుద్ది, "చెంబు వెధవా" బయటికి ఫో' అని తరిమి కొట్టాడు.

అప్పట్నుంచి, చలమయ్యంటె గిట్టని వాళ్లు, 'చెంబు' 'చెంబుగాడు' అంటం సాగించారు. ఒకొకళ్లని చూస్తె అకారణంగానే మొత్తబుద్దేస్తుందిట. అందుకు హేతువేమీ వుండదు. అది అంతే. ఆ రకంగా చలమయ్యని చూసి ప్రతివాడు ఇష్టయిరెక్టుగా చెంబుగాడు అని హింసించటం సాగించారు. విని విని బాధ పడి పడి చెంబు అంటే ఎలర్జీ పట్టుకుంది చలమయ్యకి. పడి పడి ఆ బాధకి అలవాటూ పడ్డాడు.

ఆఫీసలో చలమయ్యకి శత్రువుగా అనుకుంటున్న ఆనందయ్య ఒక సిద్ధాంతమున్నూ ప్రతిపాదించాడు, 'చెంబు అడుగు భాగపు పరిమాణము స్వల్పము. అందువలన దానికి స్థిరత్వం తక్కువ. అట్లాగే మన చలమయ్య బుర్రకూడ చెంబు వంటిదే - ఆలోచనతక్కువ ఆవేశం ఎక్కువ. అంతలోనే కోపం. అందుకే వాడు చెంబుగాడు.' ఆ మాట చలమయ్య దాకా వచ్చింది. కత్తితో కోసినట్టు బాధ పడ్డాడు చలమయ్య. అయినా అనదల్చుకున్న వాళ్లు అంటం మానలేదు. ఒకసారి ఆఫీసులో బక్క భీమయ్య కూడా అలాగె అంటువుంటే కోపంతో చలమయ్య వాడిమీద కలబడ్డాడు. ఇద్దరూ కొట్టుకుంటె మిగతావాళ్లు విడదీశారు. భీమయ్య రోషంతో నానా మాటలు అన్నాడు చలమయ్యని. 'అమ్మ చెంబుగా. కొట్టటానిక్కూడా తయారైనావా? ఉండు నీపని చెపుతా.' అంటు నోరు మరింత పెద్దది చేశాడు. చలమయ్య బిక్కచచ్చిపోయాడు. అతని నోరు పెగలలేదు. అవమానంతో తల దించుకున్నాడు. అదే అతని లోపం. అందుకే

అందరూ లోకువ కడేది. ఆ సంగతి చల మయ్యకీ తెలుసు

గంగాభవాని గొణుగుతూనే వుంది. చదువులు చదువుతూనే వుంది అంతా చూస్తూ వింటూ పుల్లయ్య ఆనందిస్తున్నాడు. చిన్నప్పుడు పుల్లయ్యని – అల్లరి పన్లు చేస్తున్నాడని, బళ్ళోకి వెళ్ళటంలేదని చలమయ్య వాయించేవాడు. అది మనసులో పెట్టుకొని కోపం పెంచుకున్నాడు పుల్లయ్య పెద్దవాడవనయినాలేదు పుల్లయ్య అంతే

వున్నకొద్దీ వుధృతం అవుతుంది, భార్య ధోరణి ఆ సంగతి చలమయ్యకి తెల్సు. అందుకే చల్లగా దొడ్లోకి జారుకుని, అంగవస్త్రం చుట్టుకొని, గంగాభవాని యల్పీ రికార్డుని శ్రవణ కఠోరమైనా, శ్రవణ పేయంగా భావించి స్నానానికి వుపక్రమించాడు చల్లనినీళ్ళు ఒంటిమీదపడి, 'దీన్ని పగలగొయ్య. ఎంత హాయిగా వుంది! ఎంత సుఖంగా వుంది!! ఎవడు ఎన్ని మాటలు అనుకుంటే ఏం? మనకి లెక్కేంటి? ఇంత ఆనందం మళ్ళా దొర్కుతుందో లేదో అని స్నానానందంలో మునిగిపోయాడు చలమయ్య. అలా ఒక అరగంట జలకాలాడి ఒళ్ళుతుడుచుకుంటు వుండగా'ఠంగు' మని మోతా, ఆ వెంటనే 'బరబరా' విన్పడి చూస్తే, తొట్టి అంచుమీద పెట్టిన చెంబు జారి కిందపడి దొర్లుకుంటూ పోయింది. చలమయ్యకి కోపం వుచ్చెత్తున వచ్చింది. దాన్ని ఆపుకోలేక పోయాడు

'గో టు హెల్. యూ బ్లడీ ఫెలో. రాస్కెల్, డాంఫూల్' అంటు నోటికి వచ్చినట్టు కసిదీరా ఆ చెంబుని తిట్టేడు. తిట్టి తిట్టి అలసిపోయి ఇంట్లోకి వెళ్ళి బట్టలు మార్చుకుంటుండగానే పుల్లయ్య అంతలోనే ఆ సొట్టపోయిన చెంబుని తీసికెళ్ళి అక్కాయికి చూపించి అందుకుగల కారణాన్ని వివరించాడు

వుండుమీద కారం రాచినట్టయింది,గంగా భవానికి. 'ఇదుగో. ఇట్రారండి' అంటు పెట్టింది. నానా గొడవ చేసింది. జాడించి వుతికి ఆరేసినంతపని చేసింది.

'ఇదిగో, నాకేం తెలీదు. రేపు మా బాబాయినీ,పిన్నినీ భోజనానికి పిలిచాను ఆయనసలే ఆఫీసరు రేపటికి ఆ చెంబుని తెల్లగా తోమి వుంచాలనుకున్నాను వెంటనే దాన్ని తీసుకెళ్ళి బాగుచేయించుకొని రండి. బజార్లో తల తాకట్టు పెట్టైనా ఇప్పుడే ఆ సరుకులూ తెండి అంతే.' అంటు శాసించింది.


ఖర్మరా బాబూ అనుకున్నా తప్పదనుకుని, ఆ చెంబుని సంచిలో పెట్టుకొని, బజార్న పడ్డాడు చలమయ్య సెంటర్లో కిల్లీకొట్టు కనపడగానే సిగరెట్ తాగాలని నాలిక పీకింది. జేబులోని అర్ధరూపాయి చిల్లరా చెంబు సొట్టలు తీయించినందుకు ఖర్చయింది, అంత క్రితమే. జేబులు కాళీ అయ్యాయి. ముకుందయ్యగాడు, ఇంట్లోలేడు. అప్పు అడుగుదామనుకున్న మిత్రుల యిళ్ళన్నీ తిరిగాడు, చలమయ్య. అందరు మొండిచెయ్యి చూపించారు. 'సారీ బ్రదర్' అన్నారు.

కాళ్ళు నొప్పులు పుట్టున్నాయి నోరు ఆర్చుకపోతువుంది. కాఫీ, సిగరెట్టు తాగాలని వున్నా డబ్బుల్లేవు. ఏడ్పు వచ్చింది. యేం చెయ్యటాన్కి తోచలేదు. వట్టి చేతులోత్తి యింటికి వెళ్తే గొడవ తప్పదు. గంగాభవాని రభసచేస్తుంది. దాని నోరు మంచిది కాదు. ఆ పుల్లయ్యగాడు నవ్వుతాడు. వాడు చిన్నప్పట్నించి తన ఇంట్లోనె పెరిగాడు అటువంటి వాడికీ తను లోకువె. ప్రపంచమే అంత. ఎదుటివాడి బాధలో ఆనందం కోసం వెతుకుతుంది !

ఒకసారి లోకువయితె అందరూ అదే అలుసుగా తీసుకుంటారు. తను ఎవర్నీ గట్టిగా ఏమీ అనలేడు. సర్దుకుపోవాలనుకుంటాడు. అది తన బలహీనతే. ఆ మెతకదనం లోపమే. ఎవర్నీ ఏమీ అంటానికి లేదు. అది ముమ్మాటికి తన తప్పే గ్రహించుకోకపోయినా బుసయినా కొట్టలేని పాము నలుగురి చేతి రాళ్ళ దెబ్బలకీ గురవుతూంది !

అందుకే తనని తను తిట్టుకుంటాడు చలమయ్య. కసిదీరా తిట్టుకుంటాడు. 'గోటు హెల్. యూ బ్లడీ ఫెలో. రా స్కెల్. డాంఫూల్.' అని తిట్టాడు బిగ్గరగా చలమయ్య. సంచిలోని చెంబు అటు ఇటు కదిలింది, కులుకుగా.

'ఒరేయి !' అన్న పిలుపుకి వెనక్కి తిరిగాడు చలమయ్య చేతిలో బరువైన సంచీతో ముకుందయ్య, దగ్గరికి వచ్చాడు. 'ఏంట్రా?'' అన్నాడు చలమయ్య 'సంగ గదా ! సరుకులు. అవునూ నువ్వు ఎక్కడేడుస్తున్నావేంటి?' అన్నాడు ముకుందయ్య, విలాసంగా. 'నా బొంద' అని నుంచున్నాడు చలమయ్య.




'సర్లె నేవస్తా. బరువుగా వుంది.' అంటు జారుకున్నాడు ముకుందయ్య. తన దగ్గర లాక్కున్న డబ్బుతోనె ముకుందయ్య అవన్నీ కొన్నాడనిపించింది. ముకుందయ్యగాడి దగ్గర ఆ సంచీ లాక్కుంటె తన సమస్య కొంత పరిష్కారమవచ్చనీ అనిపించింది. కాని అందుకు నోరు కావాలి. నటన వుండాలి. దబాయింపూ అవసరం. అంతలోనే ముకుందయ్య నడ్డి వూపుకుంటు వెళ్ళిపోయాడు — వెళ్ళిపోయాడు.

'డాంఫూల్ — రాస్కెల్' అంటు నోటికొచ్చినట్టు తిట్టాడు, చలమయ్య.

'ఎవర్ని బావగారు? అంతగా తిట్టున్నారు?'' అని అడిగాడు సి. ఐ. డీ. లా అనుసరించి వచ్చిన పుల్లయ్య. 'ఎవర్నంటె వూరుకుంటార్రా, ఈ రోజుల్లో? నన్ను నేనే తిట్టుకుంటున్నాను!' అన్నాడుచలమయ్య కసిగా. నిజానికి అది వాస్తవం కూడా.

పుల్లయ్య పక పక నవ్వాడు ఆనందంగా.

అంతకంటే బిగ్గరగా డొక్కలు ఎగిరి పడేలా నవ్వాడు చలమయ్య అది చూసిన పుల్లయ్య వెల్లమొహం వేసాడు.

అంతలో ఆగక, తన లోపలున్న 'చలమయ్యగాడి'కి కసిదీరా ఇంకా తిట్లు వడ్డించి మనసు తేలి ాగా 'చలమయ్య' వుషారుగా బజార్న పడ్డాడు సంచిలో వున్న చెంబు అటు ఇటు కదిలింది ఆ వూపుకి !